


అన్నవరంలో కనిపించిన పున్నమి చంద్రుడు









కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజమండ్రి పుష్కర ఘాట్ వద్ద ఉన్న భారీ శివలింగం మీదుగా కనిపించిన సూపర్ మూన్.. గోదావరి పుష్కర ఘాట్‌లో పౌర్ణమి స్నానాలు.. అంతర్వేది ఆలయంలో గోవింద నామాలతో ఓ మహిళ దీపాలంకరణ..

కనుల పండువగా..

కార్తీక దీపోత్సవం

- గోదావరి ఘాట్లలో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు
- కిక్కిరిసిన పంచారామాలు

అత్యంత పవిత్రంగా భావించే కార్తీక మాసంలో పౌర్ణమి విశిష్టత అందరికీ తెలిసిందే. శుక్ల పక్షంలో పున్నమి తిథి కలిగిన ఈ పదిహేనో రోజును హరి, హరులకు ప్రీతికరమైందని భక్తుల విశ్వాసం. ఈసారి కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తులు వేకువజామునే స్నానాదులు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోదావరి, కాలువలు, పుష్కరిణిల్లో దీపాలు వదిలారు. నోములు ఉన్నారు. రాత్రికి అనేక చోట్ల జ్వాలాతోరణం కార్యక్రమాలు నిర్వహించారు. పంచారామాలతోపాటు కోటిపల్లి, రాజమహేంద్రవరం గోదావరి, అన్నవరం, పిఠాపురం ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాల వద్ద కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 6

రాజగోపురంపై పున్నమి చంద్రుడు



ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయం రాజగోపురంపై బుధవారం రాత్రి పున్నమి చంద్రుడు ఇలా ప్రకాశించి ఆకట్టుకున్నాడు..

జై సత్యదేవా..

అన్నవరంలో గిరిప్రదక్షిణ







అన్నవరం వద్ద హైవేపై గిరి ప్రదక్షిణ వ్యూ.. పిల్లాడితో కలిసి ప్రదక్షిణ..

- స్వామి నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- కనుల పండువగా గిరి ప్రదక్షిణ
- రెండు లక్షల మంది హాజరు
- ఘనంగా పంపా హారతులు, జ్వాలాతోరణం



పంపానదికి కార్తీక పౌర్ణమి హారతి

7

పర్యాటకం పరుగు



- ప్రకృతి ఒడిలో.. విహారం.. వినోదం..
- కేరళ తరహాలో ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ముందడుగు
- టెండర్లు పిలిచిన పర్యాటక శాఖ
- ఇప్పటికే కేరళ టూరిజం బృందాల పరిశీలన
- తూర్పు, కోనసీమల్లో హౌస్ బోట్లు.. కాకినాడ బీచ్ పర్యాటకం.. ఏజెన్సీలో ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రకృతి వనరులను ఒడిసి పట్టుకొని పర్యాటకపరంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వ చొరవతో పర్యాటక శాఖ పరుగు పెడుతోంది. ఇప్పటికే ఎక్కడికక్కడ పర్యాటకులకు ఏర్పాట్లు ఉన్నా.. వాటిని మరింత మెరుగ్గా ఆధునిక ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. మధురపూడి విమానాశ్రయంలోని రెండో టెర్మినల్ శరవేగంగా నిర్మాణం జరుగుతోంది. రైలు ప్రయాణికులకు గేట్‌వేగా రాజమహేంద్రవరం ఉంది. పర్యాటకుల సునాయాస ప్రయాణానికి మరింత కూడలిగా అవతరించనుంది. ఇక కోనసీమ అందాలు కేరళను తలపిస్తాయి. కాకినాడ బీచ్ విదేశాల్లో విహరించిన అనుభూతి కలిగిస్తుంది. మరోవైపు మారేడుమిల్లి ఏజెన్సీ అందాలను ఆస్వాదించడానికి ఇప్పటికే పర్యాటకులు క్యూకట్టారు. ఆధ్యాత్మిక టూరిజం సరేసరి. ఇప్పుడు వీటన్నిటినీ వినియోగించుకొని పర్యాటక సర్క్యూట్‌గా పుష్కరాల నాటికి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం వేగంగా జరుగుతోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే గోదావరి పర్యాటకానికి మహర్దశ పట్టినట్టే.

● అలెప్పీ వెళ్లక్కర్లే..

హౌస్‌బోట్లకు కేరళలో అలెప్పీ(అళప్పుజ) ప్రసిద్ధి. ఇకపై అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఆ అనుభూతిని ఇక్కడే ఆస్వాదించొచ్చు. గోదావరి, వేమగిరి-ధవళేశ్వరం కాలువ, కొవ్వూరు పరీవాహక ప్రాంతాల్లో హౌస్‌బోట్ల ఏర్పాటుకు పర్యాటకశాఖ టెండర్లు పిలిచింది. కేరళకు చెందిన టూరిజం సంస్థల ప్రతినిధులు ఇప్పటికే ఇక్కడ ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్థానికంగా ఆపరేటర్లు ఉంటే వాళ్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేరళ, బెంగళూరు వంటి ప్రాంతాల్లోని పెద్ద ఆపరేటర్లతో కలిసి పనిచేసినా స్థానికంగా మేలు జరుగుతుంది. హౌస్‌బోట్లు సింగిల్ రూమ్ లేదా డబుల్ రూమ్ విధానంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పగటిపూట మాత్రమే నడుపుతారు. టూరిజం పాలసీ ప్రకారం రాయితీలు ఉంటాయి. ఇరిగేషన్ తదితర అనుమతులకు టూరిజం శాఖ సహాయ పడుతుంది. హౌస్‌బోట్లలో ఫుడ్ సదుపాయమూ ఉంటుంది. బోటుకు సుమారు రూ.30 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఆయా సంస్థలు, అవి అందించే సదుపాయాలకు అనుగుణంగా ధరలను నిర్ణయిస్తారు. ఒక్కో బోటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50మందికి ఉపాధి లభిస్తుంది.

● జల క్రీడలు..

కడియం, నిడదవోలు కాలువలు, గోదావరి లంకల్లో జల, సాహస క్రీడల టూరిజానికి ప్లాన్ చేశారు. జిప్‌లైనర్, ఎయిర్ బెలూన్స్, లాంగ్ జంప్‌లు, స్కూబా డ్రైవ్, రోప్ వే, స్పీడ్ బోట్లు వంటివన్నీ వస్తాయి. గోదావరి లోతు పుష్కర్ ఘాట్ నుంచి సరస్వతీ ఘాట్ వరకూ 30 అడుగుల లోతు ఉంటుంది. అందువల్ల హౌస్‌బోట్లు, అడ్వంచర్ పర్యాటకానికి అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు ఇసుకపై వెళ్లే వాహనాలు కేటీఎం వాహనాల వంటివి కూడా తీసుకొస్తారు. ఇసుక తిన్నెల్లో టెంట్‌లతో వసతి ఏర్పాటు చేస్తారు. హేవలాక్ బ్రిడ్జి(పాత రైలు వంతెన)ని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రైల్వేకు డబ్బు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే తర్వాత ప్రక్రియ ఆలస్యం కావడం, ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చా కేంద్ర ప్రభుత్వం రూ.46 కోట్లు మంజూరు చేసింది. హేవలాక్ బ్రిడ్జిపై బ్యూటిఫికేషన్, అటూ ఇటూ షావనీర్ షాప్స్, ఫుడ్ ఐటమ్స్ వంటివన్నీ వస్తాయి. ప్రతి స్తంభం దగ్గర రౌండ్ సర్కిల్‌ని కడతారు. అక్కడ కూర్చుని గోదావరి గాలిని ఆస్వాదించొచ్చు. ఈ వంతెనపై ఉండే నడకదారిపై నడిచి వెళ్లి బ్రిడ్జిలంకలో దిగి అక్కడి నుంచి బోటులో పుష్కర్‌ఘాట్ చేరుకొనేలా ప్లాన్ చేశారు. అయితే బ్రిడ్జికి సంబంధించి పుష్కర్‌ఘాట్ వద్ద ప్రవేశంలో 1044 చదరపు మీటర్ల స్థలం రైల్వే నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉంది. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించడంతో త్వరలోనే ఆ పని కూడా పూర్తి అయ్యే అవకాశం ఉంది.

కోనసీమ, కాకినాడల్లో...

కాకినాడలో ప్రత్యేకంగా బీచ్‌లను అభివృద్ధి చేసి బీచ్ టూరిజాన్ని మెరుగుపరుస్తారు. బీచ్ వాలీబాల్, స్నైలాంతర్లు వంటివి ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలోని దిండి, పాశర్లపూడి బ్యాక్ వాటర్స్, అప్పనపల్లి దగ్గర, యానాం, గోగుల్లంక ఫెర్రీల్లో హౌస్‌బోట్లు, వసతి ఏర్పాటుచేస్తారు. ఏజెన్సీకి సంబంధించి రంపచోడవరం, మారేడుమిల్లిలో ట్రెక్కింగ్, జంగిల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తారు. ఇప్పటికే మారేడుమిల్లిలో ఆ తరహా వసతులు కొంతవరకు ఉన్నాయి.

● ప్రతిపాదనలకు ఆహ్వానం

పర్యాటక అభివృద్ధి కోసం టూరిజం శాఖ ప్రతిపాదనలకు ఆహ్వానం పలికింది. ఆసక్తి ఉన్న వారు టూరిజం వెబ్‌సైటులో బిడ్లను పరిశీలించవచ్చు. జలక్రీడలు, సాహస క్రీడలు, లగ్జరీ హౌస్ బోట్లు, పార్టీ బోట్లు ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుంది. సంస్థలు, వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలు www.tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పర్యాటక అధికారులను 9505011951, 6309942025 నెంబర్లలో సంప్రదించవచ్చు.

● పుష్కరాల కంటే ముందే..



పర్యాటకపరంగా పుష్కరాల కంటే ముందుగానే ఓ రూపు తీసుకొచ్చి ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. స్థానికంగా కూడా ప్రాధాన్యం ఇస్తాం. పర్యాటకం అభివృద్ధి అయితే స్థానికులకు పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుంది. ఇక్కడి రుచులు, సంస్కృతి ప్రపంచానికి పరిచయం అవుతాయి. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆ దిశగా అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

- పి.వెంకటాచలం, జిల్లా పర్యాటక అధికారి, తూర్పుగోదావరి



అయినవిల్లిలో రిసార్ట్‌ను పరిశీలిస్తున్న కోనసీమ కలెక్టర్

హోమ్‌స్టేలతో పర్యాటకులకు కొత్త అనుభూతి : కోనసీమ కలెక్టర్

అమలాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హోమ్ స్టే విధానం వల్ల పర్యాటక రంగంలో స్థానిక ప్రజల జీవనశైలి, ఆచారాలు, సంప్రదాయాలు, వంటకాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పర్యాటకులు ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అయినవిల్లి, అల్లవరం మండలంలో కలెక్టర్ బుధవారం పర్యటించారు. అల్లవరం మండలం గూడాల గ్రామంలో పొల్లేటి సాయి మండవ ఇళ్లు, ముక్తేశ్వరం విళ్ల దొరబాబుకు చెందిన అయినవిల్లి కోనసీమ విల్లా రిసార్ట్, పురాతన మండువ లోగిళ్లను ఆయన సందర్శించి హోమ్‌స్టేకు అనువైన వసతులు ఏమేరకు ఉన్నదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్‌స్టే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఆ దిశగా కోనసీమలో ఉన్న పురాతన, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే మండువా లోగిళ్లను గుర్తించడం జరుగుతోందన్నారు. హోమ్‌స్టే ద్వారా స్థానిక ఆదాయ వృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ముఖ్యంగా పర్యాటకులు ఓ ప్రాంతంలోని అసలైన జీవన విధానాన్ని అనుభవిస్తారన్నారు. సాంస్కృతిక మార్పిడి, స్థానిక కళలు సంగీతం, నృత్యం, పండుగల విశిష్టతలను దగ్గరగా తెలుసుకోవచ్చన్నారు. సంప్రదాయాలపై పర్యాటకుల ఆసక్తి వల్ల స్థానికులు తమ సంస్కృతిని మరింత ఉత్సాహంగా కొనసాగించడానికి కారణమవుతుందన్నారు. అలాగే సాధారణ హోటల్ బసకు భిన్నంగా హోమ్‌స్టేలు నిజమైన స్థానిక అనుభూతిని అందిస్తాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదన్నారు. సుస్థిర పర్యాటకంతోపాటు ప్రకృతితో సఖ్యత కలిగిన పర్యావరణానికి హాని లేని రీతిలో పర్యాటకులు పూర్వపు సంప్రదాయ సాంస్కృతిక వారసత్వపు అనుభూతిని అందించడంలో ఒక సమర్థమైన సాధనమన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో కె.మాధవి, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ ఉన్నారు.

ముగిసిన పంట నష్టాల గణన

- జిల్లాలో 21,421 హెక్టార్లలో పంటలకు నష్టం
- నివేదికను ఆమోదించిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌వల్ల కలిగిన వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాల గణన ప్రక్రియ ముగిసింది. వారంరోజులుపాటు 384 బృందాలు జిల్లావ్యాప్తంగా పర్యటించి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాలను నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా 21,421 హెక్టార్లలో పంటలకు నష్టం జరిగినట్లు నమోదు చేశారు. 47,984 మంది రైతులు నష్టపోయారు. దీనిలో వరి పంట 20,486 హెక్టార్లలో, స్వీట్‌కార్న్ 26.4 హెక్టార్లలో, మొక్కజొన్న 26.5 హెక్టార్లలో, మినుం 339.5హెక్టార్లలో,పత్తి 625.9హెక్టార్లలో, మిల్లెట్స్ 0.3 హెక్టార్లలో, చెరుకు 0.6 హెక్టార్లలో నష్టం జరిగినట్లు గుర్తించి నివేదికను రూపొందించారు. ఈ నివేదికను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేశారు. దీన్ని కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం పరిశీలించి ఆమోదించారు. అనంతరం దీన్ని అమరావతిలో ఉన్నతాధికారులకు పంపించారు. అతి త్వరలో నష్టపరిహారం విడుదలయ్యే అవకాశాలున్నాయి. జిల్లాలో అత్యధికంగా పెదపూడి మండలంలో 4795హెక్టార్లలో, కాజులూరులో 3956హెక్టార్లలో, సామర్లకోటలో 3278 హెక్టార్లలో, కరపలో 2085 హెక్టార్లలో, తాళ్లరేవులో 1185, గొల్లప్రోలులో 845, గండేపల్లిలో 369, జగ్గంపేటలో 132, కిర్లంపూడి 1087, పిఠాపురంలో 563, కాకినాడ రూరల్‌లో 242, ఏలేశ్వరంలో 553, పెద్దాపురంలో 291, తొండంగి 9.8, తునిలో 0.8, యు.కొత్తపల్లిలో 1695, కాకినాడ అర్బన్‌లో 36, శంఖవరంలో 2.0, ప్రత్తిపాడులో 369, రౌతులపూడిలో 4.8 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది.

జిల్లాలోనే గణన పూర్తి చేశాం

వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

రాష్ట్రంలోనే ప్రథమంగా కాకినాడ జిల్లాలోనే పంటల నష్టాల గణన పూర్తిచేసి వాటిని కలెక్టర్ ఆమోదం తర్వాత అమరావతికి పంపించాం. క్షేత్రస్థాయిలో రైతులకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా నమోదు చేసి పంపిన ఘనత కాకినాడ జిల్లాకే దక్కుతుంది. అన్ని మండలాలలో బృందాలు సమన్వయంతో పనిచేసి పంటల నష్టాల గణనలో ముందు ఉన్నాం. పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం విడుదల చేస్తుంది.

పంచాయతీరాజ్‌శాఖలో పదోన్నతులు

- రెండేళ్ల సర్వీస్‌ను ఏడాదికి తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు

7

లావాదేవీలు జరగని ఖాతాల్లో సొమ్మును తిరిగి పొందండి: కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు5(ఆంధ్రజ్యోతి): పదేళ్లు అంతకుమించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు బ్యాంకులు తిరిగి ఇచ్చేస్తున్నాయని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. మీ డబ్బు-మీ హక్కు అనే నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలలపాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమంపై రూపొందించిన గోడపత్రికను కలెక్టర్ షాన్‌మోహన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బీమా పాలసీలు, ఇతర ఆర్థికంగా పెట్టుబడులు పెట్టడం ద్వారా కుటుంబాల భవిష్యత్తును సురక్షితం చేస్తున్నారన్నారు. కొన్ని సందర్భాల్లో ఈ ఆస్తులు లబ్ధిదారులకు చేరకపోవడానికి ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు, నామిని వివరాలు లోపం వంటి కారణాలు ఉన్నాయన్నారు. మీ డబ్బు-మీ హక్కు ప్రచార కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేరు మీద ఉన్న క్లైమ్ చేయని నిధులను గుర్తించి సరైన పత్రాలు సమర్పించడం ద్వారా సులభంగా క్లైమ్‌లను ఆర్‌బీఐ అవకాశం కల్పిస్తోందని చెప్పారు. జిల్లాలో 5,72,938 వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.83.36కోట్లు ఉందన్నారు. 1,00,48 సంస్థల బ్యాంకు ఖాతాల్లో రూ.12.60కోట్లు, కేంద్ర, రాష్ట్ర బ్యాంకు ఖాతాల్లో రూ.5.26కోట్లు వెరసి మొత్తంగా రూ.101.22కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థలు, సరైన ధ్రువపత్రాలతో ఈకేవైసీ పూర్తి చేసుకుని తమ సొమ్ములను తిరిగి పొందాలని సూచించారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపికలు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలు పురుషులు, మహిళల జిల్లా జట్టులను పంపే నిమిత్తం వివిధ క్రీడాంశాల్లో జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి వి.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, స్విమింగ్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, యోగ, వెయిట్ లిఫ్టింగ్/పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, రెజ్లింగ్, బెస్ట్ ఫిజిక్, డ్యాన్స్, మ్యూజిక్, షార్ట్‌ప్లే క్రీడలు జిల్లా క్రీడామైదానంలో ఈనెల 12న ఉదయం 9గంటల నుంచి ఎంపికలు జరుగుతాయని డీఎస్‌డీవో తెలిపారు. అర్హత కలిగిన పురుషులు, మహిళలు హాజరుకావాలని కోరారు. (ఓపెన్) నాన్ యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగులై ఉండాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగి గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, పాస్‌పోర్టు ఫొటో తీసుకురావాలన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ప్రామాణికాల ప్రకారం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పర్యవేక్షణలో క్రీడలు జరుగుతాయన్నారు. ఫైఎంపికలకు హాజరయ్యే అభ్యర్థులకు టీఏ, డీఏలు ఇవ్వరని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 11న మధ్యాహ్నం ఒంటి గంట లోపు ఏఏ క్రీడల్లో పాల్గొంటారో స్వయంగా గానీ, ఈమెయిల్(dsakakinada2023@gmail.com) ద్వారా గానీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. పైన తెలిపిన ధ్రువపత్రాలతో ఈనెల 12 ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలిపారు. ఒకరు ఒక క్రీడలో మాత్రమే పాల్గొనాలని తెలిపారు.

రేపు హాకీ శత జయంతి ఉత్సవాలు

- గోడపత్రిక ఆవిష్కరించిన కలెక్టర్
- కాకినాడలో రేపు రెండు హాకీ మ్యాచ్‌లు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హాకీశత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని రూపొందించిన గోడపత్రికను కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం ఆవిష్కరించారు. జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి వి.సతీష్, హాకీ ఆంధ్రప్రదేశ్ కాకినాడ జిల్లా జాయింట్ సెక్రటరీ వి.రవిరాజ్‌తో కలిసి ఆవిష్కరణ చేపట్టారు. హాకీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా దేశ నలుమూలల ప్రతి జిల్లాలో ఈనెల 7న ఒక మెన్ హాకీమ్యాచ్, ఒక ఉమెన్ హాకీ మ్యాచ్ జరిగేలా హాకీ ఇండియా అన్ని రాష్ట్రాల హాకీ సంఘాలకు నిర్దేశించిందని వారు తెలిపారు. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో హాకీ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. దీనిలోభాగంగా కాకినాడ జిల్లాలో జిల్లా క్రీడా మైదానం, కాకినాడలో ఉన్న ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో 7న ఉదయం 7 గంటలకు సీనియర్ మహిళలు, పురుషుల హాకీ పోటీలు ప్రారంభమవుతాయని, అదేరోజు సాయంత్రం 5గంటలకు ఫ్లడ్ లైట్స్‌లో సీనియర్ హాకీ క్రీడాకారులు, సూపర్ సీనియర్ హాకీ క్రీడాకారులతో కలిపి ఒక మ్యాచ్ జరుగుతుందని తెలిపారు. సీనియర్ హాకీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, హాకీ కుటుంబసభ్యులు అందరూ ఉదయం, సాయంత్రం హాకీ శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు.

'పది' ఫెయిలైన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్ష రాసే అవకాశం

కాకినాడరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రెగ్యులర్‌గా పదో తరగతి చదివి పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు ఓపెన్ స్కూల్‌ద్వారా ఫెయిలైనసబ్జెక్టులు మాత్రమే రాసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. వివరాలకు ఆ విద్యార్థి పదో తరగతి చదివిన ఉన్నత పాఠశాల్లో సంప్రదించాలని డీఈవో పి.రమేష్ తెలిపారు. విద్యార్థులు సార్వత్రిక విద్య www.apopenschool. ap.gov.in వెబ్‌సైట్‌లో నేరుగా జిల్లా పేరు, పాఠశాల పేరు ఎంపిక చేసి అడ్మిషన్ పొందవచ్చన్నారు. అడ్మిషన్ ఫీజును ఈనెల 8లోపు చెల్లించాలని, పరీక్ష ఫీజును షెడ్యూల్‌ను ప్రకటించిన తరువాత ఫెయిలైన సబ్జెక్టు ఒక్కింటికీ రూ.100 చెల్లించాలని సార్వత్రిక విద్య కాకినాడ జిల్లా సమన్వయకర్త పి.సాయి వెంకటరమణ తెలిపారు.

కార్తీక దీపోత్సవం

- ఆలయాల్లో భక్తి ప్రపత్తులతో కార్తీక పౌర్ణమి పూజలు
- దీపాలు వెలిగించి.. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- వ్రతాలు, అభిషేకాలు, దర్శనాలతో కిక్కిరిసిన పుణ్యక్షేత్రాలు



రాజమహేంద్రవరం గోదావరిలో చిన్నారికి నదీస్నానం చేయిస్తున్న తల్లి.. అరటిదొప్పల్లో కార్తీక దీపారాధన చేసిన యువతులు


రాజమహేంద్రవరంలో అరటిదొప్పపై దీపం వెలిగించిన యువతి


రాజమహేంద్రవరం గోదావరిలో తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో..

ద్రాక్షారామ,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామభీమేశ్వరాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు విశేషసంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచి భక్తులు రాక ప్రారంభమైంది. క్యూలైన్ల ద్వారా భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.నవవధువులు స్వామివారికి పువ్వు, పిందె సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక అభిషేకాలు జరిపారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఉసిరిక చెట్టువద్ద నోములు ఆచరించిన మహిళలు రాత్రికి ఆలయంలో దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో అల్లు వెంకటదుర్గాభవానీ పర్యవేక్షణలో సిబ్బంది సేవలందించారు. అన్న ప్రసాద భవనంలోను, పైండావారి సత్రంలోను అన్నదానం నిర్వహించారు.


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో..

సామర్లకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం బుధవారం తెల్లవారుజామునుంచీ భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున గోపూజలు చేశారు. భీమేశ్వరస్వామిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్తీక నోములు కావడంతో భక్తులు ఉపవాసాలతో పూజలు చేశారు. మారేడు, జమ్మి, రావిచెట్లులవద్ద మహిళలు దీపాలను వెలిగించారు. నూతన వధువులు కంద పిలకలు, పసుపు పిలకలతో కూడిన స్వయంపాకాలను స్వామికి సమర్పించారు. అధికసంఖ్యలో జ్వాలాతోరణంలో భక్తులు పాల్గొన్నారు.


ద్రాక్షారామలో స్వామికి పువ్వు, పిందె సమర్పిస్తున్న నవవధువు


సామర్లకోటలో భీమేశ్వరుడికి కందపిలక వాయినం సమర్పణకు వచ్చిన నూతన జంట


అన్నవరం కొండపై కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అన్నవరం పంపా తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


సామర్లకోట భీమేశ్వరాలయంలో విశేష అలంకరణలో స్వామి, అమ్మవారు

అన్నవరంలో 10వేల జంటల వ్రతాలు

అన్నవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నవరంలో సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా రద్దీ నెలకొంది. మంగళవారం రాత్రికే రత్నగిరికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి వ్రతాలు ప్రారంభించారు. మహిళలు రావిచెట్టు వద్ద కార్తీకదీపాలను వెలిగించి తమభక్తిని చాటుకున్నారు. పౌర్ణమి పర్వదినాన 10వేల జంటలు వ్రతాలు ఆచరించారు. వివిధ విభాగాల ద్వారా రూ.కోటి మేర ఆదాయం లభించింది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు సైతం తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రూ.1500 వ్రత మండపం సరిపడక ప్రత్యామ్నాయంగా ప్రధానాలయ గోపురం బయట టెంట్ వేసి వ్రతాలను నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులు ధ్వజస్తంభం దగ్గర వ్రతాలు ఆచరించుకోవాలని వస్తే టెంట్‌వేసి ఏర్పాటు చేయడంపై అభ్యంతరం తెలపడంతో అధికారులు వాటిని నిలుపుదల చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటలు సమయం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. రద్దీ అధికంగా ఉన్నంతసేపు అంత్రాలయ దర్శనం స్థానంలో శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కంపార్టుమెంట్‌లు ద్వారా మాత్రమే భక్తులను అనుమతించడంతో కొద్దిసమయం ఆలస్యమైనా అవాంచనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా కార్తీక పౌర్ణమి రద్దీ ముగిసింది.


సామర్లకోట భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


విద్యుత్‌కాంతుల వెలుగులో గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం


రాజమహేంద్రవరం గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న యువతులు


అన్నవరంలో రద్దీ కారణంగా క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

సంగమ క్షేత్రం.. భక్తజన సంద్రం

- ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- అంతర్వేదికి పోటెత్తిన భక్తులు
- సాగర తీరంలో పుణ్యస్నానాలు.. నీలకంఠుడికి అభిషేకాలు


అంతర్వేది శివాలయం వద్ద జ్వాలా తోరణం

అంతర్వేది, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాగర సంగమ తీరం అంతర్వేది పుణ్యక్షేత్రంలో బ్రహ్మ ప్రతిష్ఠించిన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వేకువజాము నుంచి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరుడు వద్ద దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. రామేశ్వరం కృత్య రామలింగేశ్వరస్వామి, మోరి, సఖినేటిపల్లి అంతర్వేది కొత్తవంతెనవద్ద ఉన్న శివాలయాల్లో భక్తులు కార్తీక పౌర్ణమి పూజలు చేశారు. అంతర్వేది శివాలయం వద్ద రాత్రి శివలింగం, ఓంకార ఆకారాలతో దీపాలను వెలిగించారు. అనంతరం వైభవంగా జ్వాలా తోరణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు.

పుణ్యస్నానాలు.. దీపోత్సవం

అంతర్వేది పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం వేకువజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామికి పంచామృతాలతో అభి షేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం వేంకటేశుడి గోవింద నామాలతో దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ ఆవరణమంతా కార్తీక దీపాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంవద్ద భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం నిర్వ హించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. పుణ్యక్షేత్రంలో అధికసంఖ్యలో భక్తులు దీపాలు వెలిగించారు.


అంతర్వేది శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పల్లకిలో ఊరేగుతున్న శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి

వాడపల్లిలో జ్వాలా తోరణం

ఆత్రేయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివునికి పంచామృతాభిషేకం, దీపాలంకరణ నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయం వద్ద జ్వాలాతోరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. వివిధ గ్రామాల్లోని శివాలయాల వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం భక్తజన శివనామస్మరణ నడుమ ఘనంగా నిర్వహించారు. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. గోదావరి నదీలో పుణ్యస్నానాలు ఆచ రించి దీపాలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.


వాడపల్లిలో జ్వాలా తోరణం

గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఏపీని నిలుపుతాం

డబ్ల్యూటీఎం-2025లో మంత్రి కందుల దుర్గేష్


లండన్‌లో డబ్ల్యూటీఎం-2025లో పాల్గొన్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్‌ని సగర్వంగా నిలుపుతామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.లండన్‌లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్(డబ్ల్యూటీఎం)-2025లో పాల్గొని ఏపీలో పర్యాటక అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలను వినిపించామన్నారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ హైకమిషనర్, వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులతో కలిసి ఆయన ప్రారంభించారు. 20కిపైగా అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లు, హోటళ్ల ప్రతినిధులు, మైస్ ఇన్వెస్టర్లు, ట్రావెల్ మ్యాగజైన్స్, మీడియా బ్లాగర్స్‌తో చర్చించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడుల అవకాశాలపై వివరణ ఇచ్చామన్నారు. ఏపీ స్టాల్ ద్వారా మన రాష్ట్రంలోని ప్రకృతి సహజ సిద్ధ ప్రదేశాలు, చారిత్రాత్మక కోటలు, తీర ప్రాంతాలు, వారసత్వ సంపదపై ప్రచారం కల్పించామన్నారు.జీఐ ట్యాగ్ పొందిన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ప్రదర్శించి వాటి ప్రత్యేకతలను, తయారీ విధానాన్ని వివరించామన్నారు. అనంతరం అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ నూతన పర్యాటక పాలసీని తెలియజేసి పెట్టుబడులను ఆహ్వానించామన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు వర్షిణి ఎంపిక



అమలాపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తూటారపు వీవీ వర్షిణి జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం లంక రాణి తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈనెల 6,7,8 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగే రాష్ట్ర సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. వర్షిణిని హెచ్‌ఎం రాణి, ఉపాధ్యాయులు, పీఈటీ బుజ్జి, సర్పంచ్ చొల్లంగి శివాలిని తదితరులు అభినందించారు.

శనేశ్వరస్వామికి వెండి ఝుటాజుటం బహూకరణ


వెండి ఝుటాజుటం బహూకరిస్తున్న దాత దంపతులు

కొత్తపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ప్రసిద్ధి చెందిన మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామికి బుధవారం కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన చిన్నే శ్రీనివాస్-లక్ష్మి దంపతులు కార్తీక పౌర్ణమి సందర్భంగా 3.18 కిలోల వెండి ఝుటాజుటాన్ని స్వామివారికి సమర్పించారు. ఈ మేరకు ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబుకు ధర్మకర్తల మండలి సభ్యులు గ్రామపెద్దల సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయార్చకులు వేదాశీర్వచనం అందించారు.కార్యక్రమంలో చింతం విజయకృష్ణమోహన్, ధరణాల రామకృష్ణ, ఎంపీటీసీ ఎస్‌వీవీ సత్యనారాయణ, పాలక మండలి సభ్యులు జీఎస్‌వీ నాగాజీ,జీవీవీ సత్యనారాయణ, గ్రంధి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు

నాణ్యమైన విద్యుత్ పంపిణీయే లక్ష్యం

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి

అనకాపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని,అందులో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బుధవారం ఆయన అనకాపల్లిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాలోని కె.కోటపాడు మండలం చౌడువాడ, కింతలి గ్రామాల్లో నిర్మించిన సబ్‌స్టేషన్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా చౌడువాడలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని ప్రాంతాల్లో కొత్తగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధించిన ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్) చార్జీ (యూనిట్‌కు) 40 పైసల నుంచి 27 పైసలకు తగ్గించనున్నట్టు పేర్కొన్నారు.ప్రతిఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకూ 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్,ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కె.రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు అక్షయ ఎంపిక



సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పి.వెంకటాపురం అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థి శీలి అక్షయ జాతీయ వాలీవాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పరిమళ తెలిపారు. ఈ నెల 1నుంచి 3వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. జాతీయ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనతో అంబేద్కర్ ఆశ్రమ పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించేలా తర్ఫీదునిస్తున్న పీడీ శారదను అభినందించారు.

వారాహిమాత ఆలయ ఆదాయం రూ.10 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

కాకినాడ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించినట్టు ఆలయ సింగిల్ ట్రస్టీ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ కాకినాడ తనిఖీ అధికారి వడ్డి ఫణీంద్రకుమార్ హుండీలను తెరవగా ఈవోలు బీవీవీ చౌదరి, ధనలక్ష్మి, మురళీ వీరభద్రరావు, సత్తిబాబు, తిరుమల రవితేజ పాల్గొనగా మొత్తం 40 రోజులకు గానూ రూ.10,18,071 ఆదాయం వచ్చిందన్నారు. సీసీ కెమెరాల నిఘాలో గ్రామ పెద్దలు, పోలీసుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కింపు జరిగినట్టు ఈవో తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోని హైవే బ్రిడ్జిల కింద రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సుమారు 50ఏళ్ల వయసు కలిగి నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు సెక్యూరిటీగార్డులు వేసుకొనే యూనిఫాం షర్టు ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు 99597 63463 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అన్నవరం.. భక్తజనసంద్రం

- వేడుకగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ
- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీసేవలో, మధ్యాహ్నం సత్యరథం వెంబడి

గిరియాత్రలో పాల్గొన్న 2 లక్షలమంది భక్తులు


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువైన రత్న,సత్యగిరిలు బుధవారం జై సత్యదేవ నామస్మరణతో మార్మోగాయి. స్వామి వెలసి భక్తులతో పూజలందుకునే 2 కొండల చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం నిర్వహించిన స్వామివారి గిరిప్రదక్షిణకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 2 లక్షల మంది విచ్చేయడంతో అన్నవరం భక్తజనసం ద్రమైంది. గతేడాది మాదిరిగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఉదయం 8.30 గంటలకు పల్లకీలో, సత్యరథం భక్తులతో మధ్యాహ్నం 2గంటలకు గిరియాత్ర ప్రారంభించారు. ఉదయం 7.30కి కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో మెట్లమార్గం గుండా కొండదిగువన తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, గిరిప్రదక్షిణ ప్రత్యేకాధికారి ఆర్‌జేసీ వేండ్ర త్రినాధరావు టెంకాయ కొట్టి స్వామివారి పల్లకీసేవ ద్వారా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామి,అమ్మవార్లను పల్లకీలో పండితుల మంత్రోచ్ఛరణలు భక్తుల గోవిందనామస్మరణలతో ఈ గిరియాత్ర తొలిపావంచా వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా బెండపూడి సమీపంలో పుష్కరకాలువ రోడ్డుగుండా సుమారు 8.5 కిలోమీటర్లమేర సాగింది.


భక్తులకు మంచినీళ్లు, పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ



పంపా తీరం వద్ద ముగిసే..

పంపా తీరం వద్ద గిరిప్రదక్షిణ యాత్ర ముగిసింది. చివరగా ప్రత్యేక మండపంలో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి చతుర్వేదపండితుల వేద స్వస్తి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు. కొందరు భక్తులు యాత్ర అనంతరం పంపా రిజర్వాయర్‌లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి రత్నగిరి కొండకు చేరుకోగా మరికొందరు తిరిగి స్వగృహాలకు చేరుకున్నారు. గిరియాత్ర విజయవంతంతో సిబ్బందిని ఈవో, చైర్మన్లు అభినందించారు. ఇదిలా ఉండగా గిరిప్రదక్షిణ దారిలో రోలింగ్ సరిగా చేయకపోవడం,ఎండుగడ్డి అక్కడకక్కడా మాత్రమే పరచడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యలో కొన్నిచోట్ల గ్రీన్‌కార్పెట్ పరచడం ఉపశమనం కలిగించింది.

ప్రభుత్వ అప్రమత్తతతో ప్రత్యేక ఏర్పాట్లు

ఇటీవల కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఇటు రెవెన్యూ, పోలీస్, దేవదాయశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. సుమారు 700మంది పోలీసులు, ఆరుగురు తహశీల్దార్లు, 20మంది వీఆ ర్వోలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు పల్లకీ, సత్యరథం వెంబడి నడుస్తూ ఎక్కడా తోపులాటలకు ఆస్కారం ఇవ్వకుండా రోప్‌పార్టీ ద్వారా కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు.

శోభాయమానంగా పంపా హారతులు

కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి పంపాహారతులు కార్యక్రమం అత్యంత శోభాయామానంగా జరిగింది. రాత్రి 6.30కి స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ తెప్పోత్సవానికి వినియోగించిన పంటు వద్దకు తోడ్కొనివచ్చి పంటుపై ఆశీనులు గావించి గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం నదీమతల్లికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం అర్చకస్వాములు పంపానదికి ఏడురకాలైన హారతులిచ్చారు. ముందుగా ఏక హారతి, నేత్రహారతి, బిల్వ హారతి, సర్పహారతి, కుంభహారతి, నక్షత్ర హారతుల నంతరం చివరగా కర్పూర హారతులిచ్చారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనంతో కార్యక్రమం ముగిసింది. ఈవో, చైర్మన్, ప్రత్యేకాధికారి పాల్గొనగా వైదిక కార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి రుత్విక్‌లు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి తదితరులు నిర్వహించారు.


జ్వాలాతోరణం వెలిగించిన దృశ్యం

వైభవంగా జ్వాలాతోరణం

కార్తీకపౌర్ణమి సందర్భంగా కొండదిగువన తొలిపావంచా వద్ద జ్వాలాతోరణం కార్యక్రమం వైభవంగా జరిగింది. పంపా హారతులు ముగిసిన తరువాత స్వామి,అమ్మవార్లను పంపాతీరం నుంచి తొలిపావంచా వద్దకు రాత్రి 8గంటలకు తోడ్కొనివచ్చారు. తొలిపావంచాకు ఇరువైపులా ఎండిగడ్డితో తోరణాన్ని ఏర్పాటు చేశారు. స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం అర్చకస్వాములు వేదమంత్రాల నడుమ తోరణానికి నిప్పంటించారు. వాటి మధ్యలో పల్లకీలో స్వామి,అమ్మవార్లను ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. తోరణం నుంచి జ్వాల అనంతరం వెలువడిన భస్మం కోసం భక్తులు పోటీపడ్డారు. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను జాతీయరహదారి మీదుగా మళ్లించారు.

కొండలు, గుట్టలు దాటుకుని...

సత్యరథం ద్వారా ప్రదక్షిణకు దేవస్థానం విస్తృత ప్రచారం చేపట్టడంతో అధికసంఖ్యలో భక్తులు సత్యరత్నగిరికొండల వెంట నడిచారు. కొండలు, గుట్టలు దాటుకుని గోవిందనామస్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. దేవస్థానం, దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, బిస్కట్ ప్యాకెట్ల స్టాల్స్ ఏర్పాటుచేశారు. దేవస్థానం తరుపున సుమారు 2 లక్షల మంచినీటి ప్యాకెట్లను పీఆర్వో విభాగం అందుబాటులో ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇబ్బందులు జరగకుండా ఈవో, చైర్మన్, ప్రత్యేకాధికారి ఎప్పటికప్పుడు వాకీటాకీల ద్వారా సమాచారం తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. మార్గ మధ్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి వైద్యసేవలందించారు. గిరియాత్రకు తరలివచ్చిన భక్తులతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఈవో సుబ్బారావు కుటుంబం




అలసిపోయిన భక్తుల అవస్థలు


సత్యదేవుడి సేవలో పాల్గొన్న మహిళలు

మా కుమార్తె మృతిపై అనుమానాలున్నాయి

పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలి : రంజిత తల్లిదండ్రులు

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 5వ తరగతి విద్యార్థిని రంజిత మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. బుధవారం పట్టణంలో ఏరియా ఆసుపత్రిలో బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటనపై రంజిత తల్లిదండ్రులు సునీత,రాజు మాట్లాడుతూ మా కూతురి మృతిపై తమకు అనుమానాలు ఉన్నట్టు తెలిపారు. ఆసుపత్రి వద్ద విలేకర్లతో వారు మాట్లాడారు. తమ కుమార్తె ఉరి వేసుకున్న తీరును చూస్తే అనుమానం కలుగుతుందన్నారు. తమ ఇంటి యజమాని కుమారుడిపై అనుమానం వ్యక్తం చేశారు. తాము ఈ ఇంటిలో 3ఏళ్లుగా ఉంటున్నామన్నారు. ఉరి వేసుకున్న చున్నీముడులు విప్పడం సాధ్యం కాలేదని, బాలిక అన్ని ముడులు వేయడం సాధ్యం కాదని తెలిపారు. ఉరివేసుకోవడానికి తమ కుమార్తె ఫ్యాను అందే ఎత్తులో లేదని అక్కడ ఎత్తుకు ఏవిధమైన స్టూల్‌గాని మరొకటిగాని ఉపయోగించిన దాఖాలాలులేవని పేర్కొన్నారు. మా కుమార్తెను హత్య చేసి ఉరి వేసి ఉండవచ్చనే అనుమానం ఉందన్నారు. ముఖ్యంగా గతంలో నేరచరిత్ర కలిగిన ఇంటి యజమాని కుమారుడిపై అనుమానం ఉందని, పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

చెడు వ్యసనాలకు బానిసై ఇళ్లల్లో చోరీలు


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న తిమ్మాపురం ఎస్ఐ

యువకుడి అరెస్ట్

బంగారం, వెండి, నగదు స్వాధీనం

సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనే ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని తిమ్మాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. 10.6 గ్రాముల బంగారు వస్తువులు, 1026.4 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.18,196 నగదును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లో కెళితే కాకినాడ సూర్యారావుపేటకు చెందిన లంక నాగవీర వెంకట దుర్గాశివ గణేష్ (20) ప్రస్తుతం లచ్చి రాజువారి వీధి టూటౌన్ పోలీస్‌స్టేషన్ వెనుకాల నివసిస్తున్నాడు. అతడు గతంలో దుస్తుల దుకాణంలో పని చేసి 2 నెలల క్రితం మానేసి ఇంటిలో ఉంటున్నాడు. చెడు వ్యసనాలు, ఫోన్‌లో బెట్టింగ్‌లకు బానిసై డబ్బుల కోసం తిమ్మాపురం, టూటౌన్ పోలీసుస్టేషన్ల పరిధిలో బయట తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద పగటి పూట రెక్కీ నిర్వహించి వరుస చోరీలకు పాల్పడు తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4.50 గంటలకు గణేష్ తిమ్మాపురం వై.జంక్షన్ వద్ద ఉండగా అరెస్ట్ చేసినట్టు తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు

రెండేళ్ల సర్వీస్‌ను ఏడాదికి తగ్గిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ

ఉమ్మడి జిల్లాలో నూతనంగా 60 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సిబ్బందికి భారీస్థాయిలో పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు 2 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ అర్హత ఉండగా ఇప్పుడు ఆ కాలాన్ని ఏడాదికి తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1కి పదోన్నతి పొందనున్నారు. అలాగే 150 మందికి పైగా 1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందనున్నారు. ఇకపై గ్రామ సచివాలయాల పర్యవేక్షణ కోసం మండలస్థాయిలో డిప్యూటీ ఎంపీడీవో పోస్టులను నూతనంగా నియమించనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో ఉన్న 60 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలు బాధ్యతలు చేపటి ఆయా మండలాల్లో సచివాలయాలను పర్యవేక్షించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనను ఆమోదించడంతో మార్గం సుగమమైంది.

నగదు, మోటార్ సైకిళ్ల చోరీ కేసులో నలుగురి అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు మైనర్లు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాల్సిన సమయంలో వారు చెడుమార్గం పట్టారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో ముగ్గురు మైనర్లు ఉండటం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గల చల్లా చినబాబు షాపింగ్ కాంప్లెక్సులో లక్ష్మీవెంకటేశ్వర ఏజెన్సీస్, ఐస్‌పార్లర్‌లో రూ. 45 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. షాపు నిర్వాహకుడి ఫిర్యాదుతో గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కాగా, సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారంగా దర్యాప్తు సాగించారు. దీంతో చోరీకి పాల్పడిన పిఠాపురం పట్టణానికి చెందిన గుబ్బల దయానంద్‌పాల్ (22), 17 సంవత్సరాల బాలుడు ఒకరు, 16 సంవత్సరాల బాలురు ఇద్దరితో కలిపి నలుగురిని అరెస్టు చేశారు. అంతేకాకుండా విచారణలో వీరు మరిన్ని చోరీలకు పాల్పడినట్టు వెల్లడైంది. ఇందులో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, పిఠాపురం మండలం మాధవపురంలో రెండు మోటార్ సైకిళ్లను చోరీ చేసినట్టు గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. కాగా నిందితుల్లో ఒకరు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. మిగిలిన ఇద్దరు మైనర్లు మధ్యలో చదువు మానివేసినట్టు తెలిసింది. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

పోలీస్ కేసు నమోదు

రాజానగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధి రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న ఒక విద్యార్థి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ బుధవారం ఇక్కడ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చందుర్తికి చెందిన యార్ల ప్రసాద్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయన కుమారుడు యాళ్ల సత్యదేవకుమార్ (16) తొర్రేడులోని ఓ విద్యాసంస్థలో గల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుకుంటున్నాడు. కాగా, తాను వసతి గృహంలో ఉండలేకపోతున్నానని, ఇంటి వద్ద నుంచే కళాశాలకు వెళ్తానని అప్పుడప్పుడూ మారాం చేసేవాడు. ఈ క్రమంలో గత నెల 28న సత్యదేవకుమార్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కళాశాల నుంచి యాజమాన్యం అనుమతితో తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత హాస్టల్‌కు తిరిగి తీసుకెళ్లే క్రమంలో ఇంటి వద్ద నుంచే వెళ్తానని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు ఈ ఏడాది ఓపిక పట్టు, వచ్చే ఏడాది నుంచి నీకు నచ్చినట్టు కళాశాలకు వెళ్దువుగాని అని నచ్చజెప్పి పంపించేవారు. ఈ క్రమంలో ఈనెల 4న ఉదయం 10.30 గంటలకు తండ్రి ప్రసాద్ సత్యదేవ కుమార్‌ను తీసుకుని కళాశాలకు చేరుకున్నారు. తన కుమారుడు డే స్కాలర్‌గా చదువుతా నంటున్నాడని ప్రిన్సిపాల్‌తో మాట్లాడి ఒప్పించి వదిలి వచ్చినట్టు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో తన కుమారుడు ఉరేసుకున్నాడని, కొనఊపిరితో ఉండడంతో సాయి ఆసుపత్రిలో చేర్పించామని అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కళాశాల యాజమాన్యం ఫోన్‌లో సమాచారం అందించింది. దీంతో వెంటనే ఆసుపత్రికి వచ్చి చూడగా తన కుమారుడు చనిపోయినట్టు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారని ఆయన తెలిపారు. ఈమేరకు తన కుమారుడు ఇంటిమీద బెంగతో హాస్టల్‌లో ఉండలేకే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్నానని, తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ తండ్రి ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతికేసులో అదుపులోకి..

- నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టిన యానాం పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న యానాం ఎస్పీ వరదరాజన్, సిబ్బంది

యానాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యానాం బల్లవారివీధిలో ఓ ఇంట్లో అద్దెకుంటున్న వివాహిత అనుమానాస్పద మృతి కేసులో నిందితుడైన భర్త పెమ్మడి నానిను యానాం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యానాం ఎస్పీ వరదరాజన్ వివరాలను వెల్లడించారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదివికి చెందిన పెమ్మడి దీనా(26), భర్త నానీ గత నాలుగు నెలలుగా అద్దెకు ఉంటు న్నారు. కాగా, వీరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరగుతున్నాయి. మద్యానికి బానిసైన నాని తరచూ భార్యను అనుమానంతో కొడుతుండేవాడు. దీంతో దీనా కొంత కాలంగా వేరుగా ఉండటంతో పాటు భర్త నాని నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్ర యించారు. ఈ క్రమంలో నాని మళ్లీ గొడవ పడ్డాడు. కాగా, దీనా ముఖంపై బలంగా కొట్టడంతో పాటు పీక పిసికి హత్య చేసిన అనంతరం ఆమె ఫోన్ తీసుకుని నాని పారిపోయాడు. మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం బంధువులకు అప్పగించారు. యానాం పోలీసులు, క్రైంసిబ్బంది నిందితుడు నానిని అదుపులోకి తీసుకుని హత్యకు గల కారణలను సేకరించారు. అనంతరం నిందితుడ్ని కోర్టులో ప్రవేశపరిచి రిమాండ్ కోసం యానాం సబ్ జైలుకు తరలించారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అడలరసన్, ఎస్ఐలు పునీత్‌రాజా, కట్టా సుబ్బరాజు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

కొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనరేటర్ నుంచి వచ్చిన కరెంట్‌షాక్‌తో ఒకరు మృతిచెందాడు. ఈ సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో బుధవారం చోటుచేసుకొంది. దళితపేటకు చెందిన ఎం. నూకరాజు (31) గ్రామ శివార్లో రొయ్యల చెరువుల వద్ద కూలీ పనులు చేస్తుంటాడు. చెరువులకు వచ్చే కరెంటు స్తంభంపై హెచ్‌జీ ఫీజు పోవడంతో బుధవారం కరెంట్ సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోవడంతో చెరువుల నిర్వాహకుడు నూకరాజును స్తంభం ఎక్కి హెచ్‌జీ ఫీజు వేయాలని చెప్పడంతో ఎక్కి ఫీజు వేస్తుండగా అప్పటికే ఆన్‌లో ఉన్న జనరేటర్ కరెంటు స్తంభానికి రిటర్న్ వచ్చి షాక్ కొట్టడంతో నూకరాజు స్తంభంపైనే మృతిచెందాడు. సమాచారం తెలుసుకొన్న కొత్తపల్లి ఎస్ఐ జీ. వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీతంపేటలో అగ్నిప్రమాదం

- రెండిళ్లు దగ్ధం ..

రూ. 5 లక్షల ఆస్తినష్టం


కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూసిబ్బంది

వీఆర్‌పురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో బుధవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఉదయం పుట్టలో పాలు పోసేందుకు ఇరు కుటుంబాల వారు వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో సామగ్రి, నగదు, బంగారం కాలిపోవడంతో బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. రూ. ఐదు లక్షల ఆస్తినష్టం ఏర్పడిందని అంచనా. రెవెన్యూ ఆర్ఐ అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాలకు తహశీల్దార్ సరస్వతి ఆదేశాలతో 25 కిలోల బియ్యం అందజేశారు. దాతలు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

నల్లజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిన్ను ప్రేమిస్తున్నాను.. వివాహం కూడా చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ వివాహితను నమ్మించి మోసం చేసిన యువకుడిపై నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయ్యింది. వివరాలివి.. తెలికిచర్లకి చెందిన మరీదు రామాంజనేయులు తన భర్తతో విభేదాల కారణంగా గత మూడు సంవత్సరాలుగా పుట్టింటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శారీరకంగా కలిశారు. ప్రస్తుతం ఆమె గర్భం దాల్చడంతో మొఖం చాటేశాడు. దీంతో పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నేడు నిందితులను అరెస్టు చేసే అవకాశం
- లోకేష్‌ను కలిసిన మృతుడి భార్య దేవి



అమలాపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండంలోని కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్య కేసును అమలాపురం పట్టణ పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని ఎట్టకేలకు ఛేదించారు. నిందితుల వివరాలను గురువారం ప్రకటించే అవకాశం ఉంది. కాగా మంగళవారం రాత్రి శ్రీనివాస్ భార్య దేవి తన పిల్లలను తీసుకుని ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌ను కలిసి తన భర్త శ్రీనివాస్ హత్యకు దారితీసిన పరిస్థితులను వివరిస్తూ తన గోడు వెళ్లబుచ్చుకుంది. వైసీపీకి చెందిన రౌడీషీటర్లు తన భర్తను అతి కిరాతకంగా హత్య చేశారని ఆమె తన బిడ్డల సాక్షిగా వివరించింది. తన కుటుంబానికి తీరనిఅన్యాయం చేసిన వైసీపీ నాయకుల ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరింది. అలాగే రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. హత్యకు దారితీసిన పరిస్థితులను ఇప్పటికే పోలీసులు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాల్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు పాల్పడిన కీలక నిందితులు గంగుమళ్ల షణ్ముఖేశ్వరరావు అలియాస్ కాసుబాబు, అడబాల శంకర్, సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, భాస్కర్ల ప్రసాద్, రావులపాలెంకు చెందిన అనిల్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికీ ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. హత్య రోజు ఏమి జరిగింది? ఇందులో ఎవరెవరు పాల్గొన్నారు?నాలుక కోసేశారా?తదితర అంశాలపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు పూర్తి చేసినట్టు సమాచారం. హత్య జరిగిన నాటి నుంచి ప్రధాన నిందితుడు కాసుబాబు పరారీలో ఉండటంతో అమలాపురంలోని ఆయన వ్యాపార లావాదేవీలన్నీ పూర్తిగా స్తంభించాయి. హత్యకు ఉపయోగించిన ఆయుధాల కోసం పోలీసులు ప్రధాన పంటకాల్వల్లో బుధవారం వేట చేపట్టినట్టు తెలిసింది. ఇంతకూ శ్రీనివాస్ చేత ఫోన్ చేయించింది ఎవరు అనేది పోలీసులే చెప్పాలి.

4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారం చోరీ

కడియం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిలంకలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడి ఇంట్లో దొంగతనం జరిగి 4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారం పోయినట్టు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పొట్టిలంకకు చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ అలియాస్ చెముడులంక డాక్టర్ వేపూరి సూర్యసత్యనారాయణ, అతని భార్య ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. ఈయనకు ఉన్న ఇద్దరు అబ్బాయిల్లో ఒకరు అమెరికాలో, మరొకరు సింగపూర్‌లో ఉంటుండగా, అమ్మాయి హైదరాబాదులో ఉంటున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి ఆర్‌ఎంపీ డాక్టర్ సూర్యసత్యనారాయణ ఇంటి ప్రధాన ద్వారం తెరిచిబీరువా తాళాలు పగుల గొట్టి బంగారం, వెండి దొంగిలించుకుపోయారు. పొట్టిలంకలోనే ఉంటున్న డాక్టర్ పెద్దకోడలు స్వాతి ఉదయం సమయంలో ఇంటిని శుభ్రం చేయడానికి తలుపులు తెరవగా తలుపులు, బీరువా బద్దలు కొట్టి ఉన్నట్టు గమనించారు. దీంతో బీరువాలో వస్తువులు పోయినట్టు గమనించి అత్తమామలకు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఏ. వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాప్రసాద్, క్రైమ్ సిబ్బందితో పాటు క్లూస్‌టీమ్‌ను రప్పించి సంఘటనా స్థలంలో పలు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆర్ ఎంపీ డాక్టర్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమిశ్రగూడెంలో 16.5 కాసుల బంగారం చోరీ

- వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీమ్

నిడదవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లోని బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో నివాసముంటున్న కాసగాని సత్యనారాయణ భార్యకు ఈనెల 1వ తేదీన పాము కాటు వేయడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటిలో లైట్లు వెలుగుతుండడంతో కాసగాని సత్యనారాయణ అన్న కుమారుడు దుర్గాప్రసాద్ ఫోన్ చేసి ఇంటిలో లైట్లు వెలుగుతున్నాయి వచ్చేశారా అని పలకరించడంతో హుటాహుటిన వచ్చిన సత్యనారాయణ ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా సుమారు 16.5 కాసుల బంగారు ఆభరణాలు దొంగలు పట్టుకొని పోయినట్టు గుర్తించి సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సమిశ్రగూడెం ఎస్సై జె.కల్పన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఇంటి నుంచి వేలిముద్రలు సేకరించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

డిప్యూటీ సీఎం పవన్ సంతాపం

పిఠాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు చలమలశెట్టి సునీల్ తండ్రి డాక్టర్ చలమలశెట్టి సురేంద్రనాథ్ మృతికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బుధవారం సంతాపం తెలిపారు. నిబద్ధతతో వైద్యసేవలందించిన సురేంద్రనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. సురేంద్రనాథ్ కుమారులు సునీల్, అనిల్‌కుమార్, వెంకటేష్ ఇతర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మార్మోగిన శివనామస్మరణ

భక్తజనసంద్రమైన ఆలయాలు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో స్నానాలు



పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం



కాకినాడలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఉమారామలింగేశ్వరస్వామి



సామర్లకోటలో అభిషేకిస్తున్న జిల్లా అటవీ అధికారి

పిఠాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శివనామస్మరణతో పిఠాపురం మార్మోగింది. పాదగయ క్షేత్రం భక్తజనసంద్రమైం ది. రహదారులన్నీ భక్తులతో కిక్కిరిశాయి. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని పాదగయ క్షేత్రం బుధవారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడింది. పాదగయ పుష్కరణిలో పుణ్యస్నానాలు ఆచరించి కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మ వార్లను దర్శించుకుని పూజలు జరిపారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామికి శాంతి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉన్న మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. పాదగయ పుష్కరిణిలో అరటి డొప్పలపై ఉంచిన దీపాలను వదిలారు. కుక్కుటేశ్వర స్వామికి పంచామృత మహాన్యాస పూర్వక రుద్రాభి షేకం జరిగింది. పురుహూతికా అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. రాత్రి లక్ష పత్రిపూజ, లక్ష కుంకుమార్చన నిర్వ హించారు. ఆలయంలో భక్తులకు ఏ అసౌకర్యం కలుగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని సోమేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పిఠాపురం భాష్యం స్కూలు ఆవరణలో పుష్పాలతో శివలింగం, స్వస్తిక్, ఓమ్ ఆకారాలను తీర్చిదిద్దారు. కార్తీక దీపాలను వెలిగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివాలయానికి తెల్లవారుజామునే భక్తులు వచ్చి ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రోజంతా ఉపవాసం ఉన్న భక్తు లు సాయంత్రం ఆలయానికి వచ్చి కార్తీక దీపాలు వెలిగించా రు. ఇళ్ల వద్ద సంప్రదాయబద్ధంగా కార్తీకపౌర్ణమి నోము ఆచరించారు. విష్ణాలయం, వెంకటేశ్వరస్వామి, భక్త మార్కండేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవాలు చేపట్టారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలంలోని ఆలయాలకు కార్తీకపౌర్ణమి శోభ చేకూరింది. చేబ్రోలులోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, దుర్గాడలోని పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామి, తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి అభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్రాభిషేకాలు జరిగాయి. ఆలయాల్లో దీపాలు వెలిగించారు. దుర్గాడలో రామలింగేశ్వరస్వామికి ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు జటాజూటధారి అలంకారం చేశారు. లలితాదేవిని విశేషంగా అలంకరించారు. తాటిపర్తిలో అపర్ణాదేవికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. నిమ్మకాయలతో అలంకారం చేశారు. వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజాది కార్యక్రమాలు జరిపించగా కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో శ్రీరాజశేఖరస్వామి ఆలయం, ఉప్పాడలో శ్రీ చౌడేశ్వరీసమేత రామలింగేశ్వర స్వామి, కొమరగిరిలో శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఆకాశ దీపం దర్శనం చేసుకున్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బుధ వారం ప్రత్యేక పూజలు జరిగాయి. కాకినాడకు చెందిన మద్దిపూడి సతీష్, మహాలక్ష్మి దంపతులు ఆలయ ఆవరణలో 500మంది ముత్తయిదువలకు పసుపు, కుంకుమలను అందజేశారు. మధ్యాహ్నం రాజశేఖర ఘనాపాటి తదితర పండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన లక్షపత్రి పూజల్లో తిరుపతికి చెందిన ఆనందరావు దంపతులు ఆశీనులయ్యారు. జిల్లా అటవీశాఖాధి కారి ఎస్.రామచంద్రరావు సతీసమేతంగా ఆలయానికి చేరుకు ని భీమేశ్వరుడికి, బాలాత్రిపుర సుందరి అమ్మవార్లకు విశేషపూజలు నిర్వహించారు. ఆలయ నందిమండపం వద్ద పండి తులు చెరుకూరి సుందరరామయ్య, రాజగోపాలశర్మలతో వేదాశీర్వచనంతో డీఎఫ్‌వో దంపతులు ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను స్వీకరించారు. డీఎఫ్‌వో వెంట సామర్లకోట కలప డిపో వర్తక సంఘ ప్రతినిధులు మహంకాళి వెంక టగణేష్, యెండ్రు సాయిబాబు, కంచర్ల వినయ్, శంకర నేత్రా లయం వైద్యులు పాల్గొన్నారు. కార్తీకపౌర్ణమి రోజున భీమేశ్వరాలయం ఎదుట నిర్వహించిన జ్వాలాతోరణం కింద అటూ ఇటూ నడిచేందుకు భక్తులు అధిక సంఖ్యలో భక్తిప్రపత్తులు కనబరిచారు. మండుతున్న జ్వాలాతోరణం కింద నడవడం ద్వారా సర్వపాపాలు తొలగి నరక ద్వారం నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. కేదారేశ్వర వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసే భక్తులు ఉపవాస దీక్షలతో శివకేశవుల పూజలు చేయడంలో భాగంగా ఈ ఆలయం సమీపాన ఉన్న పురాతన మాండవ్యనారాయణ స్వామి ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు చేరుకుని పూజలు చేశారు.

కాకినాడలో...

కాకినాడ సిటీ/ కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): న్యూ పోర్టు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయాన్ని చిత్తశుద్ధితో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. దేవాలయంలో జరిగిన సువర్ణ జల పాశుపతా రుద్రాభిషేకం, మహా రుద్రాభిషేకంలో పాల్గొని పూజలు చేశారు. వరుపు సూరజ్ కుమార్ మాట్లాడుతూ 1963లో తమ పూర్వీకులు ఈ ఆలయానికి శంకుస్థాపన చేసి 1974లో స్వామివారిని ప్రతిష్ఠ చేసి అప్పటి నుంచి నిత్య కైంకర్యసేవలు చేస్తున్నారన్నారు. టీడీపీ సిటీ అధ్య క్షుడు మల్లిపూడి వీరు, నాయకులు ఒమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, మాలకొండయ్య, శివరామకృష్ణ తదితరులున్నారు.

పన్ను చెల్లించని ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు



స్థలం వద్ద బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనేక ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పన్నుల చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22 (ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించారు. కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఖాళీ స్థలాల్లో పన్ను చెల్లించకపోవుట వల్ల జప్తు చేస్తున్నట్లు బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు నగరంలోని దాదాపు 30 ఖాళీ స్థలాల్లో జప్తు బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. ఈనెల 25లోపు ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. లేకపోతే స్థలాలను జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైభవంగా చండీహోమం



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో బుధవారం చండీహోమం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమం సాగింది. అభిషేకాలు, గోపూజ, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా ఆలయ ఈవో సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

చక్రస్నానం



గరుడువాహనంపై రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులు

పిఠాపురంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం చక్రస్నానం నిర్వహించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. గరుడవాహనంపై గ్రామోత్సవం జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఈవో సున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవాసమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'స్వదేశీ ఉద్యమం బలోపేతానికి కృషి'

కొత్తపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో స్వదేశీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు పంపన శేషగిరి ఆధ్వర్యంలో బుధవారం కొత్తపల్లిలో పర్యటించి స్వదేశీ వస్తువులను విక్రయించాలని ఫ్యాన్సీ షాపులు, పాన్‌షాప్‌ల యజమానులకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రవణం సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ కన్వీనర్ గండి కొండలరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్, జె గౌరీశంకర్, అనుసూరి దుర్గాప్రసాద్, గొల్లపల్లి ప్రభాకర్, సిద్ధి రామమోహన్ పాల్గొన్నారు.



ఫ్యాన్సీ షాపు నిర్వాహకుడికి కరపత్రాన్ని అందజేస్తున్న కొత్తపల్లి బీజేపీ నేతలు

కాకినాడను క్లీన్‌సిటీగా తీర్చిదిద్దాలి

కమిషనర్ సుధాకర్



మస్టర్ ఆఫీసులో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ సుధాకర్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): కాకినాడను క్లీన్‌సిటీగా తీర్చిదిద్దే దిశగా ప్రతీ పౌరుడు సహకరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ కెటి.సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పారిశుధ్య సర్కిల్-1 పరిధిలోని కృష్ణనగర్, వైద్యనగర్ ప్రాంతాల్లో పారిశ్య పనులను పరిశీలించారు. అనంతరం మస్టర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికను పరిశీలించారు. కాకినాడను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దడంతో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచి, చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికే అందించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో బందోబస్తు



సూర్యారావుపేట బీచ్‌లో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మెరైన్ సీఐ

సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ సముద్రతీరంలో వాకలపూడి మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్తీకమాసం పురస్కరించుకుని బుధ వారం కార్తీకపౌర్ణమి సందర్భంగా వేలాది మంది భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచి కుంభాభిషేకం, కాకినాడ రూరల్ సూర్యారావుపేట, ఎన్టీఆర్ బీచ్, నేమాం, కరప మండలం ఉప్పలంక వద్ద సముద్ర స్నానాలు ఆచరిం చేందుకు విచ్చేశారు. భక్తులు తెల్లవారుజామునే సముద్రతీరానికి రావడం, సముద్రంలో స్నానాలు చేసేందుకు దిగడంతో పోలీసులు అప్రమత్తం చేశారు. మొంథా తుఫాను ప్రభావంతో సముద్రంలో గుంతలు ఏర్పడటంతో స్నానాలు చేసేందుకు వెళితే ప్రమాదం పొంచి ఉందని, నిర్దేశించిన ప్రాంతాల్లోనే సముద్ర స్నానాలు చేయాలని సీఐ రామ్మోహన్‌రెడ్డి భక్తులను కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా బీచ్‌లో హెచ్చరికలు చేస్తూ, గజ ఈతగాళ్ల, మెరైన్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్ఐ పి.సురేష్, సిబ్బంది ఉన్నారు.

'ఆధ్యాత్మికతతో అశాంతి, క్రోధం దూరం'



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఉమర్‌ఆలీషా, వైడీ రామారావు

పిఠాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు పరిపూర్ణత్వం కలిగించేదే కార్తీక మాసమని, కార్తీక దీపం చంద్రుడి తేజస్సుగా మనలో జ్ఞానదీపాన్ని వెలిగిస్తుందని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా తెలిపారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా పిఠాపురం శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో బుధవారం జరిగిన ఆధ్యాత్మిక సభలో ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. ఆధ్యాత్మికత ద్వారా మానవునిలో అశాంతి, క్రోధం దూరమై మానసిక ప్రశాంతత చేకూరుతుందని తద్వారా మన ఆలోచనలు సరయిన దిశలో పయనిస్తాయన్నారు. మానవునిలో సదాలోచనలు సమాజాభివృద్ధి వైపు నడిపిస్తాయని తెలిపారు. సమాజంలో ప్రతీవారు తమకు ఉన్నదాటిలో తోటివారికి సహాయపడాలని సూచించారు. ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఉమర్‌ఆలీషా, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు ప్రారంభించారు. పలువురు భక్తులు రక్తదానం చేశారు. పక్షులకు ఆహారంగా వేసేందుకు గానూ భక్తులకు ధాన్యపు కుచ్చులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పింగళి ఆనందకుమార్, ఎన్‌టీవీ ప్రసాదవర్మ, ఏవీవీ సత్యనారాయణ, ఆకుల రవితేజ, గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి

జైలు, జరిమానా

కాకినాడ క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 23 మందికి కాకినాడ స్పెషల్ మొబైల్ జెఎఫ్‌సిఎం కోర్టు మెజిస్ట్రేట్ ఎన్.ఉషాలక్ష్మికుమారి జైలు, జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ 1 అండ్ 2 సీఐలు ఎన్.రమేష్, డిరామారావు తమ సిబ్బందితో మంగళవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షించగా 23 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారిలో ఏడుగురికి ఒకరోజున చొప్పున జైలు శిక్ష, మరో ముగ్గురికి 2రోజుల చొప్పున జైలు, మరో 13 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

డీటీసీ కుమారుడు హల్‌చల్

కాకినాడ క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) శ్రీధర్ కుమారుడు సాయిరాం బుధవారం కాకినాడ మెయిన్‌రోడ్డులో హల్‌చల్ చేసాడు. సూపర్ మార్కెట్ ఎదురుగా తన కారును నిలిపి సైడ్ మిర్రర్‌లో నుంచి వెనుక నుంచి ఎవరు వస్తున్నారో గమనించకుండా కారు డోర్ తీశాడు. అటుగా వస్తున్న పాల వ్యాపారి పాల క్యాన్‌లతో సహ తన ద్విచక్ర వాహనంతో కింద పడిపోయాడు. సుమారు 70 లీటర్ల పాలు నేల పాలయ్యాయి. జరిగిన ఘటనకు బాధ్యత వహించాల్సింది పోయి బండి రాసుకోవడం వల్ల కారుకు ఉన్న బీడింగ్ ఊడి పడిపోయిందని సాయిరాం ఎదురు తిరిగాడు. అక్కడ ఉన్నవారంతా సాయిరాంని వారించే పని చేసినా వినకుండా చంపేస్తానంటూ ఆ వ్యాపారిని బెదిరించాడు. ఘటనను చూసి తప్పు సాయిరాందేనని స్థానికులు ప్రశ్నించినా సాయిరాం వారిపై కూడా దుర్భాషలాడాడు. అక్కడ ఉన్న వారందరు పాల వ్యాపారానికి మద్దతు పలకడంతో తన తండ్రి డీటీసీ శ్రీధర్‌ను ఫోన్ చేసి పిలిచాడు. ఆయన ప్రభుత్వ వాహనంలో డ్రైవర్, కానిస్టేబుల్‌ను తీసుకుని ఘటనా స్థలికి చేరుకున్నారు. పాల వ్యాపారితో పాటు తనకు తోడు వచ్చిన స్నేహితుడిని డీటీసీ బృందం చితకబాదింది. వారు ఎదురు తిరిగి దాడి చేయబోయే సాయిరాం ఎడమ కన్నుపై చర్మం కందింది. అనంతరం డీటీసీ ఆయన కుమారుడు అక్కడ నుంచి మెల్లిగా జారుకున్నారు

పార్కుల ప్రైవేటీకరణ నిలుపుదలకు చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే పంతం నానాజీకి వినతి



ఎమ్మెల్యే నానాజీకి వినతి పత్రం అందిస్తున్న వాకర్స్ సంఘ ప్రతినిధులు

సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆహ్లాదాన్నందించే పార్కుల నిర్వహణాబాధ్యతలను ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం డిమాండ్ చేసింది. బుధవారం బోట్‌క్లబ్ వాకర్స్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో సభ్యులు గొడారిగుంటలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంతం నానాజీని కలుసుకుని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ 9 పార్కులను కార్పొరేట్, వాణిజ్య సంస్థలకు అప్పగిస్తే ప్రజలు పార్కులకు దూరం అవుతారన్నారు. పార్కుల అభివృద్ధికి సహకారం అంది స్తానని, పార్కుల నిర్వహణ బాధ్యతలు ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వమే మరింత సమర్థంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పంతం నానాజీ హామీ ఇచ్చారు. మొంథా తుఫానులో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినం దుకు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా సైక్లోన్ ఫైటర్ అవార్డు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే నానాజీని వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అప్రమత్తం

సామర్లకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు జరుగుతున్నాయన్న సమాచారంతో సామర్లకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, సిబ్బంది, డాక్యుమెంట్ లేఖర్లు బుధవారం అప్రమత్తం అయ్యారు. కాగా జిల్లాలో ఏ ప్రాంతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో దాడులు జరుగు తున్నాయన్న స్పష్టమైన సమాచారం లేకున్నప్పటికీ ముందుగానే సామర్లకోట సిబ్బంది తేరుకున్నారు. కాగా పౌర్ణమి రోజు కావడంతో సామర్లకోటలో బుధవారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా నమోదు చేసుకోలేదని తెలిపారు.

PUBLIC NOTICE

I am instructed by my client **Miss Thute Ramya, D/o. Madhu** R/o D.No. 1-144, Near Prakasam Convent, Madhuranagar, Kakinada Rural Mandal who intends to avail loan from SBI, RASMECC, Kakinada and in that process she wants to make Xerox Copies of her title deeds i.e., Regd. Gift Deed bearing Doc.No.1045/1981 along with Original Documents which were kept in a bag and proceedings from her house to xerox shop at karanamgari center on her Motor Vehicle on 24-09-2025. After reaching Karanamgari Center and while trying to make xerox copies of above documents, my client found that original of Regd. Gift Deed bearing Doc.No.1045/1981 was not found and immediately she searched from xerox shop to her house and asked passersby if they have found the original Regd.Gift Deed bearing Doc.No.1045/1981, but her efforts are in vain. She gave police complaint in this regard and Indrapalem Police also gave Certificate on 01-11-2025 as document is not traceable. If anybody having any rights, claims or objections over the same they can intimate to my counsel within 7 days of this notice. Otherwise my client treates that there are no claims over the property and it will not bind my client whatsover.

Schedule Property Covered Under Doc.No.1045/1981: Previously E.G.Dist., at present Kakinada District, SRO, Kakinada, Kakinada Municipality Ward No.1, Block No.66, Suryaraopeta Village, S.No. 125/4, Plot No.7 to an extent of 591 Sq.Yards or 433.95 sq.meters of site within following boundaries and measurements. **East:** 50' or 15.50 meters site in S.No.144/2; **West:** 50' or 15.50 Meters 10' Width of site left for way in this property and others also left 10' width of site for way (20' width way); **South:** 106' or 33.43 meters site of Thute Ravindra; **North:** 103' or 31.51 meters site in plot no.6 belongs to vendor with all easementary rights etc.,

H. VISWANATH, Advocate
D.No. 8-23-2, Jammalamadakavari Street, Flat No. G-4, Sri Lalitha Heights, Gandhi Nagar, KAKINADA - 4. Cell: 98663 02686

అయ్యప్పస్వామికి లక్ష బిల్వార్చన

కిర్లంపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం గ్రామంలో అయ్యప్పస్వామి లక్ష బిల్వార్చన, పడిపూజ కార్యక్రమం జరిగింది. దీనికి జనసేన జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఎ.శివస్వామి, రామకృష్ణస్వామి మొదటి శబరిమల యాత్ర సందర్భంగా చంటిబాబు గురుస్వామి ఆధ్వర్యంలో మామిళ్ళపల్లి రామకృష్ణ శాస్త్రి, మామిళ్ళపల్లి అయ్యప్ప గురుస్వామిచే ఇది జరిగింది. ముందుగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మంత్రి లోకేశ్ దృష్టికి విలీన మండలాల సమస్యలు



కూనవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుగు యువత అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ తెలిపారు. చింతూరు, వీఆర్.పురం, కూనవరం, ఎటపాక విలీన మండలాల్లో ప్యాకేజీలో వస్తున్న సమస్యలు, భూసేకరణపై మంత్రికి వివరించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం శబరి, గోదావరి నదుల కారణంగా వరదలు వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండలంలోని కాచవరం, పోచవరం కాలనీ పంచాయతీలు, గొమ్ముగూడెం, అభిచర్ల తదితర గ్రామాలను పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామాలుగా గుర్తించాలని మంత్రి కోరినట్టు తెలిపారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు

వీఆర్‌పురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం శివాలయాలు భక్తులతో కిటకిట లాడాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి వడ్డిగూడెం గ్రామంలోని శ్రీరుద్రకోటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని వీఆర్‌పురం, వడ్డిగూడెం, రేఖపల్లి, రాజుపేట తదితర గ్రామాల్లో భక్తులు అటవీ ప్రాంతంలో ఉన్న పుట్టల్లో పాలుపోసి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోతుగూడెం, (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోసీలేరు నది తీరంలో మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి నదీ తీరంలో పూజలు నిర్వహించారు. అనంతరం పొల్లూరులో శ్రీదుర్గా మల్లేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధానార్చకుడు అయినవిల్లి కుమార్ స్వామి శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు.ఆలయ కమిటీ సభ్యులు సతీష్ రాఘవన్, ఎం.శివ రామకృష్ణ, వేపకాయల శ్రీను, గోవిందరాజు, రమేష్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

వై.రామవరం, (ఆంధ్రజ్యోతి): గుర మండ కాశీ విశ్వనాథ స్వామి సన్నిధిలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు దీపాలంకరణ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లాల వెంకట రమణా రెడ్డి, వెలుగూరి ప్రభాకర్ రెడ్డి, పల్లాల పండు రెడ్డి, అందాల బుల్లబ్బాయి రెడ్డి, వార్డుమెంబర్ మంగాదేవీ, సిరిబాల సాంబయ్య, భక్తులు పాల్గొన్నారు.

'గిరి'ని చుట్టేసారు..

రాజవొమ్మంగి నవంబరు 5(ఆంధ్రజ్యోతి):రాజవొమ్మంగిలో శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం కొండపై ఉంది. ఆలయంలో ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తొలిసారి గ్రామస్థులు ఆలయం చుట్టూ బుధవారం స్వామి ఉత్సవ విగ్రహంతో గిరిప్రదక్షిణ నిర్వహించారు. సర్పంచ్ గొల్లపూడి రమణి, ఆలయ అర్చకులు శ్రీనివాస్ పిలుపుతో అధిక సంఖ్యలో ప్రజలు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. రామలింగేశ్వర స్వామిని పల్లకీలో ఊరేగించారు. ఆలయం ఆవరణలో జ్వాలా తోరణం నిర్వహించారు. లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో డీఎస్పీ పూజలు

రాజవొమ్మంగి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, రాజవొమ్మంగి గ్రామదేవత నూకలమ్మ ఆలయం, జడ్డంగి శివాలయాలను రంపచోడవరం డీఎస్పీ సాయి ప్రశాంత్ సతీసమేతంగా బుధవారం సందర్శించారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, రాజవొమ్మం, జడ్డంగి ఎస్ఐలు శివ కుమార్ పాల్గొన్నారు.

'బిర్సా' జయంతి వేడుకలు

మోతుగూడెం, నవంబరు5(ఆంధ్రజ్యోతి): గూడూరు పంచాయతీ తూలు కొండ గ్రామంలో ఆశ్రమ గర్ల్స్ హైస్కూల్‌లో బుధవారం బిర్సా ముండా జయంతి నిర్వహించారు. ముండా చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులతో నిర్వహించిన మాక్ పార్లమెంట్ ఆకట్టుకుంది. హెచ్ఎం కె.సుధా, కె.లక్ష్మి, వార్డెన్ కె.కుమార్‌రావు, పీడీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

రోడ్లకు ఇరువైపులా తుప్పలు తొలగింపు

దేవీపట్నం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవీపట్నం పంచాయతీ కృష్ణుడి పాలెం ఆర్అండ్ఆర్ కాలనీలో సర్పంచ్ కుంజం రాజమణి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త తుప్పలను తొలగిస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా దోమలకు యాంటీ లార్వా ఆపరేషనల్ స్ప్రేయింగ్ చేయించామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై త్వరలో దీక్ష

దేవీపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల నుంచి బయట గ్రామాల్లో అద్దెకుంటూ అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతూ జీవనం కొనసాగిస్తున్న దేవీపట్నం గ్రామ నిర్వాసితులకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు అన్యాయం చేయడంతో నిర్వాసితుల సమస్యలపై నిరసన దీక్ష చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు దేవీపట్నం ఆర్అండ్ఆర్ కాలనీ నిర్వాసితుల కమిటీ సభ్యులు గేదెల పెద్ద సుబ్బారావు, గేదెల చిన్న సుబ్బారావు, దొడ్డ సింహాద్రి తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

దేవీపట్నం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వెలగపల్లి గ్రామంలో బుధవారం దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో సైబర్ నేరాలు ఎక్కువయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



శివుడికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న సచ్చిదానంద సరస్వతి స్వామిజీ

తుని రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని తపోవన క్షేత్రంలోని స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. క్షేత్ర పీఠాధిపతులు సచ్చిదానంద స్వామిజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పలువురు పండితులతో పాటు భక్తులు పూజలు జరిపారు. తుని పట్నం గవరపేట శివాలయం, తేటగుంట ఉమామహేశ్వరస్వామి ఆలయం, తుని పట్టణ శివారు, తాండవ నది తీరాన గల తాండవ లింగేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణం నిర్వహించారు.

ఆదిత్య యూనివర్సిటీలో పూజలు

గండేపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో బుధవారం కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు. డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతులు, డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, శృతిరెడ్డి దంపతులు అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీరామ్‌శర్మ ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఆలయాలు కిటకిట

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జాము నుంచే శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. మహిళలు పుష్కర కాలవలు, చెరువుగట్టు వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. జగ్గంపేట ఉమా చంద్రశేఖర్‌స్వామి, గోపాలస్వామి, వెంకటేశ్వర స్వామి, విఘ్నేశ్వర, అయ్యప్ప, సుబ్రహ్మణ్యేశ్వర తదితర పలు ఆలయాల్లో భక్తజనం ప్రత్యేక పూజలు జరిపారు.



ఆత్మ కమిటీ చైర్మన్ సూరిబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఆత్మ కమిటీ చైర్మన్‌గా సూరిబాబు

జగ్గంపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మల్లిశాల గ్రామానికి చెందిన క్లస్టర్ ఇన్‌చార్జ్ టీడీపీ సీనియర్ నాయకులు పైడిపాల సూరిబాబును వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) కమిటీ చైర్మన్ గా ప్రభుత్వం నియమించింది. నవంబర్ 7న జగ్గంపేట-గోకవరం రోడ్డులోని మండపంలో ప్రమాణ స్వీకారానికి ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం చైర్మన్ సూరిబాబు ఆహ్వాన కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్య ప్రభను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి పత్రాలు అందించారు. ఆయన వెంట రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సర్వసిద్ధి లక్ష్మణరావు, పల్లికొండ భద్రం, నియోజవర్గ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ భూపాలపట్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండరాముని తెప్పోత్సవం

రౌతులపూడి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మూలగపూడి గ్రామంలోనున్న కోదండరాముని తెప్పోత్సవాన్ని ఆలయ కమిటీ వైభవంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వేములమ్మ సరోవరంలో సాయంత్రం సమయంలో తెప్పోత్సవాన్ని నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన కోటివొత్తుల అఖండ జ్యోతిని వెలిగించారు. ఏకాశిలపై సీతారాముల విగ్రహాలు ఉండడంతో ఈ ఆలయానికి మరో భద్రాదిగా పేరుపొందింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు తగిన చర్యలు తీసుకున్నారు.

ప్రగతిలో ఫైడ్స్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

గండేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలలో ప్రగతి అడ్వాన్స్‌డ్ టెక్నికల్ హబ్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే జాతీయస్థాయి విద్యార్థుల సాంకేతిక సదస్సు ఫైడ్స్ 2026 పోస్టర్‌ను బుధవారం కళాశాల చైర్మన్ డాక్టర్ పి.కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సదస్సును 2026 జనవరి 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు.

రైతుల ఆందోళనపై విచారణ

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జె.కొత్తూరు గ్రామ పరిధిలో ఉన్న మూడు క్వారీల వల్ల పంటలు సరిగా పండడం లేదని పలువురు రైతులు ఆర్‌పీఐ సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ పి.ప్రసాద్ దృష్టికి ఇటీవల తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో మైనింగ్ అధికారులు బుధవారం విచారణ జరిపారు. క్వారీల వల్ల రైతులు ఎలాంటి బాధపడుతున్నారో స్వయంగా వారు చూశారు. దీనిపై 15 రోజులలో నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు హామీ ఇచ్చారు.

గిరి ప్రదక్షిణలో మజ్జిగ పంపిణీ

జగ్గంపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సత్యదేవుడి గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు జగ్గంపేట గ్రామానికి చెందిన భారతీయ ధర్మ పరిషత్, రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి మజ్జిగ, వాటర్ ప్యాకెట్ వంటి తినుబండారాలు పంపిణీ నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ పాల్గొని భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడారు. సత్యదేవుడు ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు.

పెళ్లి పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్ట్

అడ్డతీగల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు అడ్డతీగల ఎస్ఐ వినోద్ తెలిపారు. తిమ్మాపురానికి చెందిన ద్వారపురెడ్డి అరవింద్ మండలంలో ఒక గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోస గించాడు. దీనిపై ఆ యువతి ఈనెలతిన ఫిర్యాదు చేసింది. బుధవారం అరవింద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వివరించారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించాలి

రంపచోడవరం, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరిం చుకుని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించాలని సీనియర్ దళిత నాయకుడు మాదే రామ చంద్రరావు బుధవారం ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన నివాస, ప్రాథమిక, సెక్యులర్ సోషలిస్టు తదితర హక్కులు కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

సత్యదేవుడి భక్తులకు పండ్లు పంపిణీ

తొండంగి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్నవరం సత్యదేవుని గిరి ప్రదక్షిణకు హాజరైన భక్తులకు తుని ఎమ్మెల్యే యనమల దివ్య, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆదేశాల మేరకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. బుధవారం బెండపూడి శివారులోని ప్రదక్షిణ మార్గంలో స్టాళ్ళు ఏర్పాటు చేసి టీడీపీ సీనియర్‌నేత యనమల రాజేష్ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించారు. పంపానీటి సంఘం అధ్యక్షులు చందు, ఆత్మ కమిటీ చైర్మన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్, సాధనాల నూకరాజు, యర్రబ్బు తదితరులు పాల్గొన్నారు. జనసేన అధ్యక్షులు బెండపూడి నాయుడు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ అందించారు. మణిబాబు, ప్రవీణ్, దాసు, హరి, గోపి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో ప్రత్తిపాడు నాయకులు

ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం జరిగిన సత్యదేవుని గిరి ప్రదక్షిణలో మండల నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎం.మురళీకృష్ణంరాజు, ధర్మవరంనకు చెందిన కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, ముదునూరి సీతారామరాజు, పి.వెంకటేశ్వరరావు తదితరులు గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు.

అరుణాచలేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అరుణాచలేశ్వర ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అపీత కుచాంబ అమ్మవారి ఆలయం వద్ద లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రమానంద ఆధ్వర్యంలో పూజలు, అన్న ప్రసాద వితరణ చేశారు. ధర్మవరం శివాలయం వద్ద సప్తాహ ఉత్సవాల్లో భాగంగా పల్లా పద్మారావు, నూకరత్నం దంపతుల ఆధ్వర్యంలో అన్నమయ్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా నూకరాజు పర్యవేక్షణలో భజనలు చేశారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రదర్శన

తుని రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తూ మండల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండల వెలుగు డిపార్టుమెంట్‌లో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థిని ఎంపిక

తుని రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయా నియోజకవర్గాల నుంచి ఒక్కొక్క విద్యార్థిని ఎంపిక చేసి మాక్ అసెంబ్లీ నిర్వహించాలని గతంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సూచించిన తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం ప్రతి నియోజకవర్గం నుంచి విద్యార్థిని క్విజ్, వ్యాసరచన పోటీల ద్వారా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా తుని నియోజకవర్గానికి సంబంధించి మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రమ్యప్రియ మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. ఎంపికైన విద్యార్థిని ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం రోజున అసెంబ్లీలో సందడి చేయనుంది.

ఆలయాల్లో భక్తుల పూజలు

రౌతులపూడి, నవం బరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక పౌర్ణమిని ఘనంగా జరిపారు. రౌతులపూడి, మేరకచామవరం శివాలయాలు కిటకిటలాడాయి. రౌతులపూడిలోనున్న శివాలయం సాయంత్రం భక్తులతో కిటకిటలాడింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరంపాలెం గ్రామానికి గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. నూత న సబ్ స్టేషన్ పనుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందన్నారు.